# నీటి బుడగలు

శ్రీ నాయుడు వెంకట సీతారామమూర్తి

"అబ్బా! ఉండండీ? పువ్వులు నలిగిపోతున్నాయ్!"

"నలిగిపోతే మళ్ళీ కొని తెస్తానుగా!"

"తేవడానికి మీరు రేపు ఉండరుగా!"

"ఉండక ఎక్కడికి పోతానేమిటి?"

"మీ ఊరు"

"నేను వెళ్ళను

"వెళ్ళకపోతే కాళ్ళూ చేతులూ కట్టేసి మరీ పంపిస్తారు"

"ఎందుకని?"

"వెళ్ళి తీరవలసిందే!"

"అదే ఎందుకని?"

"ఎల్లుండి ఆషాఢం ప్రవేశం"

"అయితే!"

"తొలిసంవత్సరం కొత్తల్లుడు ఆషాఢమాసంలో అత్తవారింటివద్ద ఉండకూడదు"

"ఎందుచేత ఉండకూడదు?"

"మీకు ఏమీ తెలీదు. ఆ నెలలో అల్లుడు దాటిన గడప అత్తగారు దాటకూడదు"

"దాటితే?"

"కీడు"

"ఎవరికి"

"అత్తగారికీ, మామగారికీ"

"పోనీలే, మనకు కాదుగదా"

"చాల్లెండి ఎవ్వరైనా వింటే నవ్విపోతారు."

"ఇంతకూ ఈ నెల్లాళ్ళూ మనకు ఎడబాటు తప్పదంటావ్? పోనీ ఒక చిన్న ఉపాయం పన్నితే?"

"ఏమిటో చెప్పండి"

"నేను మీ యింట్లో ఉండకూడదు. నువ్వు మా యింట్లో ఉండకూడదు. అందుకని యిద్దరం కలసి మీ అక్కగారింటికి పోయి అక్కడే యీ నెల్లాళ్ళూ గడిపితే?"

"చాల్లెండి. నలుగురూ వింటే నవ్విపోతారు"

"ఎందుకని?"

"నా మాట వినరూ? ఈ నెలరోజులూ మీరు ఒంటరిగా ఉండవలసిందే"

"తప్పదంటావా!"

"తప్పదు మరి"

"ఏంచేస్తాం! సరేకానీ మాట-కూట్లో గుసగుసలు ఏలా ఉన్నాయి"

"ఏమిటో సరిగా చెబుదురూ?"

"కొత్తల్లుడికి ఏమివ్వడానికి నిశ్చయించారో?"

"నిర్ణయానికేముంది. ఏవో రెండు జతలు బట్టలు పెడతారు"

"అంతేనంటావా?"

"అంతే"

"మరి డబ్బువిషయం ఏమీ అనుకోవడంలేదేమిటి?"

"అబ్బే! నాకేం తెలీదండీ!"

"మీ యింట్లో విషయాలు నీకు తెలియకపోవడం ఏమిటి! చెప్పు మరి"

"ఓ వంద రూపాయలు యిద్దామనుకుంటున్నారు"

"ఒక్కవందే"

"పెళ్ళికిచ్చేరుగా ముప్పైవందలు"

"అవి పెళ్ళికిచ్చినది యిప్పుడిచ్చేవి మనుగుడుపుకి"

"యిప్పుడైనా వందే యిద్దామనుకుంటున్నారు"

"నువ్వు కాస్తరికమెండ్ చేద్దూ? వందరూపాయలు చాలవని"

"నాకేం తెలీదు. నేను చెప్తే నా మీద కేకలెయ్యరూ?"

"ఏడిచినట్టే ఉంది నీ తెలివి-యిటువంటి సమయాల్లోనే నీ తెలివితేటలు చూపించాలి మరి"

"నాకేం! చెప్పి చూస్తాను లెండి"

"చెప్పి ఒప్పించాలి"

2

"యిదిగో నాయనా! ప్రస్తుతానికి ఈ రెండు వందలూ దగ్గర ఉంచుకో. యిప్పుడు చేతిలో లెక్క లేదు. మళ్ళీ వచ్చింతర్వాత యిస్తాను"

"సరే అత్తయ్యా! నేవెళ్ళొస్తాను"

"మంచిది నాయనా. అందర్నీ అడిగేనని చెప్పు. మా పేరిట ఉత్తరం వ్రాయకపోయినా మీ ఆవిడ పేరనైనా ఉత్తరాలు వ్రాస్తూ ఉండు. లేకపోతే బెంగ పెట్టుకుంటుంది"

"అలాగేనండి"

3

ప్రియమైన సుశీలకు,

రాజమండ్రి
29-6-57

యిక్కడ అంతా క్షేమం. అత్తగారినీ మామ గారినీ అడిగేనని చెప్పు. ఏదో ఊసుపోడానికి ఉత్తరం వ్రాయడం తప్ప, వ్రాయడానికి విశేషాలు ఏమున్నాయి? తిరుగుటపాలో నే ఉత్తరం వ్రాస్తావు కదూ!

ఇట్లు
సర్వేశ్వరరావు

ప్రియమైన.........వారికి

కాకినాడ
2-7-57

ఉత్తరం అందింది. వెళ్ళినవెంటనే ఉత్తరం వ్రాస్తారో లేదో అనుకున్నాను. నేను మాత్రం ఉత్తరంలో వ్రాయడానికి ఏమున్నాయి గనుక? అంతా క్షేమం. అత్తమామలకు నమస్కారములు.

యిట్లు "మీ"
సుశీల

రాజమండ్రి
సుశీ, 6-7-57

నాకు యిక్కడ ఏమీ తోచడంలేదు. ఒక్కొక్క ని ముషం ఒక్కొక్క యుగంలా గడపవలసివస్తున్నది రాత్రిళ్ళు సరిగా నిద్రపట్టడంలేదు. నిద్రపోదామంటే నీ జడలోని గులాబీ పూవులే జ్ఞాపకానికి వస్తున్నాయి. షికారుకి వెళ్తామంటే నీ చేతిగాజుల గలగల ధ్వనులు నా హృదయాన్ని కిలకిలా నవ్విస్తున్నాయి. పోనీ ఏమీతోచక ఏ పుస్తకమైనా చదువుకుందామంటే నీ చిరునవ్వులే స్ఫురిస్తున్నాయి. ఏమిచేయనో చెప్పుకలలో కూడా నీ రూపమే.

ఇట్లు
సర్వేశ్వరరావు

శ్రీవారికి నమస్కారములు.

కాకినాడ
10-7-57

మీరు వ్రాసిన ఉత్తరం అందింది. అబ్బా! ఎంత కవిత్వం వెళ్ళబోశారు! ఎంత చక్కగా వర్ణించేరు నన్ను! యింటిదగ్గర ఉన్నప్పుడు ఒక్కసారీ నన్నలా వర్ణించలేదే? పెళ్ళి రెండువారాలు కాలేదు కదా! అప్పడే యీలా గాభరాపడితే యింకా పత్తంరోజులు ఏలా గడుపుతారండీ! ఒకవేళ ముందు ముందు నాలు గైదు నెలలు ఏకాంతంగా ఉండవలసివస్తే అప్పుడు మరెంతగా చిందులు త్రొక్కుతారో! ఏమీ తోచక పోతే యింటిపనులు చూసుకోండి. రాత్రిళ్ళు అంతగా నిద్రపట్టకపోతే నిద్రపట్టే మాత్రలు వేసుకుని హాయిగా నిద్రపట్టించుకోండి.

మీ,
సుశీల

సుశీ, రాజమండ్రి
14-7-57

అమూల్యమైన నీ ఉత్తరం అందింది. ఉత్తరంలో నీవిచ్చిన సలహాకు సంతోషం. కానీ వాటిని అల వాటు చేసుకునే అవసరం ప్రస్తుతానికి నాకు కలగ నందుకు చాలా విచారిస్తున్నాను. నాకు ప్రస్తుతం బాగానే ఊసుపోతోంది. అదృష్టవశాత్తూ నా క్లాసుమేట్ మిస్ సీత నన్ను కలుసుకుంది. మేమిద్దరం కలసి సినిమాలకూ, నాటకాలకూ పోతున్నాం. యిరవై నాలుగు గంటలూ మేమిద్దరం ఆటపాటలతో

కాలక్షేపం చేస్తున్నాం. అందుచేత ప్రస్తుతం నాకు ఏమీ తోచకపోవడం అంటూ లేదు. మాత్రలు వేసుకుని నిద్రపట్టించుకునే అవసరంకూడా లేదు. మైగాడ్! అప్పుడే టైము ఆరయిందే! వస్తాను. సీతతో కలిసి సినిమాకు వెళ్ళాలి —

సర్వేశ్వరావు

ప్రియమైనవారికి,

దీనురాలు వ్రాయునది.

17-7-57

కాకినాడ

ఇంతలోనే మీరలా మారిపోతారని కలలోకూడా అనుకోలేదు. ఆనాటి రాత్రి జ్ఞాపకం తెచ్చుకోండి! నీవే నా ప్రాణం, నీవే నా సర్వస్వం అన్నారు. అమాయకురాల్ని నిజమేనని నమ్మేను. కానీ ఈనాటికి మీ మోసం, దగా అర్థమైంది. కొన్నిరోజుల ఎడబాటువల్ల మీ మనస్సు మారిపోయింది. మీరు పరస్త్రీ వ్యామోహంలో పడ్డారు. కనీసం నేను ఎంత బాధపడతానో అని ఆలోచించకుండా ఈ సంగతి ఉత్తరంలో వ్రాశారు. ప్రియురాలితో సినిమాకు వెళ్ళే హడావిడిలో సరిగ్గా ఉత్తరం వ్రాయడానికి కూడా తీరిక లేకపోయింది కాబోలు! ఇదంతా నాదురదృష్టం. మీ విలాసాలకు నేనెన్నడూ అడ్డురాను. సాధ్యమైనంతవరకూ ఈ అలవాట్లను మానడానికి ప్రయత్నించండి—శలవు.

అభాగ్యవతి
సుశీల

రాజమండ్రి
20-7-57

ప్రియమైన సుశీలకు,

ఉత్తరం చూసి నీవు నిజంగానే టోకరాతిన్నావు. నామీద కోపాకోశంగా ఉత్తరం వ్రాశావని సరదాగా నిన్ను ఏడిపిద్దామని యీ ఉత్తరం వ్రాశాను. నిజంగానే నమ్మేశావన్నమాట. నాకిక్కడ స్నేహితురాలు ఎవ్వరూ లేదు. సినిమాలు, షికార్లు అంతా ఉట్టివి. అంతా కల్పన—యిప్పుడైనా నమ్ముతావా? నమ్మకపోతే వచ్చింతర్వాత నా హృదయాన్నే అడిగి తెలుసుకుందువుగాని—వస్తాను.

ఇట్లు
సర్వేశ్వరరావు

శ్రీవారికి

కాకినాడ
24-7-57

అమ్మయ్య! ఏమిటో అని నిజంగానే హడిలిపోయాను. మొన్నటి ఉత్తరం చూసినప్పటినుంచీ నాకు సరిగ్గా నిద్రాహారాలు లేవంటే నమ్మండి. యిప్పటికి నా మనస్సు కుదుటబడింది. ముఖ్యంగా మీకో విషయం చెప్పాలి. ఊహూ! యిప్పుడు చెప్పను. వచ్చినతర్వాత చెప్తాను. వచ్చేటప్పుడు గులాబీ పూవులు తేవడం మరచిపోకండి.

మీ 'సుశీల'

కేసరిగారి

శ్రీఫలాది పానకం

గర్భమునందు, నోటియందు మేహజబ్బులవల్ల, యితర కారణములవల్ల పుండగుట, చీము నెత్తురుతో మలము వెలువడుట, నీళ్ల విరేచనములను నివారించును. గ్రహిణిజబ్బులు, అతిసారము, కడుపునొప్పితోకూడిన జిగట విరేచనములను నమ్మకముగా కుదుర్చును.

వెల రు. 1.60

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు — 14.